# బీరప్ప డోళ్ళు

డోలాసురుడనే రాక్షసుడిని పరమశివుడు చంపినపుడు, డోలాసురుడు చనిపోతూ తనపేరు చిరస్థాయిగా ఉండేవిధంగా చేయమని ప్రార్థిస్తాడు. అందువల్ల పరమశివుడు డోలాసురుని చర్మాన్ని డోలుగా ఉపయోగపడునని ఆ డోలు వాద్య సహకారంతో దేవునిపై కథలు చెప్పతాయని వరమిస్తాడు. అవే బీరప్పడోళ్ళు అని ప్రసిద్ధిపొందినవి. ఈ బీరప్పడోళ్ల కళారూపాన్ని ప్రదర్శించేవారు కురమ కులస్థులు. వీరు బీరప్పడోళ్ళు వాద్య సహకారంతో మల్లన్న, బీరన్న, మల్లయ్య, గొల్లమల్లయ్య మరియు కాటమయ్య కథలను దేవుని ఉత్సవాలకు చెబుతుంటారు. కాటమేశ్వరుని జాతర శివరాత్రి అయిన తర్వాత పున్నమికి చేస్తారు.



ఈ జానపద కళారూపాన్ని ప్రదర్శించే కురుమ కులస్థులు. కార్యక్రమాలు లేని రోజులలో గొర్రె రోమాలతో కంబళ్లు అల్లుతుంటారు. ఈ జానపద కళారూపంలో తొమ్మిది మంది కళాకారులు ఉంటారు. వీరు పచ్చచొక్కాలు, ఎర్రచొక్కాలు ధరించి పంచెలు కడతారు. ప్రక్కవాద్యాలుగా (1) గజ్జెలు (2) ఫ్లూటు (3) తాళం. కాళ్లకు గజ్జెలు కట్టి తలకు ఎర్రపాగా ధరిస్తారు మరియు ప్రతి ఒక్కరు డోలును మెడకు కట్టుకొని వాయిస్తూ ఉంటారు. వీరు డోళ్లు వాయిస్తూ పోట్లాడుకుంటూ నృత్యం చేయటం ఒక ప్రత్యేక ఆకర్షణ.

దేవుని గుళ్లలో ఉత్సవాలకు అమ్మవారి జాతరలకు కురమ కులస్థుల ఇళ్లల్లో పెళ్లిళ్లకు వీరు ఈ కళారూపాన్ని ప్రదర్శనలు చేస్తూ ఉంటారు. వీరు అనంతపురం జిల్లాలో ఎక్కువగా ఉన్నారు.